


## జనవరి - ఫిబ్రవరి ౨౦౦౯

'కథాసాగర మథనం' శీర్షికన కథ విశ్లేషణ ఆరంభించేకన్నా ముందు కొన్ని విషయాలు స్పష్టంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ శీర్షిక కథలకు మాత్రమే పరిమితం. ఇట్టి పరిస్థితులలో ఈ విమర్శను వ్యక్తిగతంగా భావించకూడదు. రచయిత పేరుతో సంబంధం లేకుండా కేవలం 'కథ' ఆధారంగా చేసే విమర్శ ఇది.

అలాగే, 'ఫలానా పత్రికలో ప్రచురితమైన కథ ఇది' అంటూ విమర్శించటం వల్ల కూడా, ఆయా పత్రికాధిపతులు కానీ, కథలను ఎంపిక చేసేవారు కానీ విమర్శను కథలు ఎంపికపై విమర్శగానో, పత్రికపై విమర్శగానో భావించకూడదు కథా సాగర మథనంలో విమర్శ పరిధి, ప్రపంచం కథనే.

కథా రచన సంవిధానం, ఎంచుకున్న అంశం, అంశం పాతదే అయినా విన్నూత్నంగా ప్రదర్శించటం, వంటి అంశాల ఆధారంగా కథను విశ్లేషించటం జరుగుతుంది. సాధారణంగా మన కథలు కొన్ని అంశాల చుట్టే తిరుగుతాయి. అలాంటి అలవాటయిన అంశాల చుట్టూ కాక విభిన్నమైన అంశాల ఆధారంగా సృజించిన కథలను ప్రత్యేకంగా పాఠకుల దృష్టికి ఈ శీర్షిక మాధ్యమంగా పరిచయం చేయటానికి ప్రాధాన్యం ఉంటుంది.

చివరగా, ఈ నెలకథగా ప్రచురించే కథ పూర్తిగా నా వ్యక్తిగత అభిప్రాయం, అంచనాల ఆధారంగా ఎన్నుకోవటం జరుగుతుంది. నా దృష్టిలో ఆ కథ ఎందుకు 'ఈ నెల కథ' అయిందో వివరిస్తాను. పాఠకులు విభేదించవచ్చు. కానీ, ఈ విషయంలో చర్చ వ్యక్తిగతాలకు అతీతంగా కేవలం సాహిత్య పరంగానే జరగాల్సి ఉంటుంది.చివరగా, నేను కూడా రెగ్యులర్‌గా కథలు రాస్తూనే ఉన్నాను. అయితే, నా కథలను ఈ శీర్షికన పరామర్శించను, ప్రస్తావించను. అలాగే అనువాద కథలను కూడా ప్రస్తావించను. మరో విషయం, ఈ శీర్షికన నేను వ్యక్తపరచే అభిప్రాయం కేవలం నా వ్యక్తిగతం. ఒక కథ చదివితే నాకు 'ఎలా అనిపించింది' అన్న అంశం ఆధారంగా జరుపుతున్న విశ్లేషణ ఇది. ఒక రచయితగా, విమర్శకుడిగా, పాఠకుడిగా, నా స్పందన ఇది. ఇప్పుడిక కథాసాగర మథనం ఆరంభిద్దాం....

'మార్చి'నెలలో కథాసాగర మథనానికి జనవరి, ఫిబ్రవరి నెలల్లో ప్రచురితమైన కథనలను పరిగణనలోకి తీసుకోవటం జరిగింది. ఈనాడు, ఆంధ్రజ్యోతి, వార్త, సాక్షి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి దిన పత్రికల ఆదివారాల అనుబంధాలలో ప్రచురితమైన కథలు, స్వాతి, మాసపత్రికలలో ప్రచురితమైన కథలు కలిపి మొత్తం 139 కథలను విశ్లేషించి, పాఠకుల పరిచయానికి ఎంచుకున్న కథల సంఖ్య 5..

ఎప్పటిలాగే అనేక కథలు ప్రేమలు, తల్లితండ్రులను పిల్లలు చూసుకోవటం, అత్తకోడళ్ళు అర్థం చేసుకోవటం, ఆరళ్ళు పెట్టటం, శృంగారం ప్రాధాన్యంగా నడిచాయి. వాటిలో కాస్త విభన్నంగా ఉన్న కథలివి.

*ఇద్దరు డాడీలు వద్దు నాన్నా:*

ఎమ్. హేమలత రచించిన ఈ కథ 18 ఫిబ్రవరి 'నవ్య' వార పత్రికలో ప్రచురితమయింది. ఇలాంటి కథలు మనకు అలవాటే అయినా రచయిత్రి కథను చెప్పిన తీరు ఆకట్టుకుంటుంది. ఎవరినీ దోషిలా చూపకుండా, ఉపన్యాసాలిచ్చి, పాఠాలు చెప్పకుండా సున్నితమైన సమస్యను అంత సున్నితంగా ప్రదర్శిస్తుందీ కథలో. కిన్నెర, వినోద్‌లు ప్రేమ వివాహం చేసుకుంటారు. వాళ్ళకి అమూల్య అనే కూతురు పుడుతుంది. ఉద్యోగరీత్యా కిన్నెర, వినోద్‌లు వేర్వేరు నగరాల్లో ఉండాల్సి వస్తుంది. కొన్నాళ్ళకు కిన్నెర, నివాస్ అనే అతడి వైపు ఆకర్షితురాలవుతుంది. వివాస్‌ని పెళ్ళిచేసుకుంటుంది. అమూల్యని తన దగ్గరే ఉంచుకుంటుంది కానీ, అమూల్య కొత్త డాడీని ఇష్టపడదు. వినోద్‌తోనే ఉండాలని నిశ్చయించుకుంటుంది. ఇదీ కథ. కథలో రచయిత్రి మానవ మనస్తత్వాలను, ముఖ్యంగా వికాస్ వల్ల తల్లితండ్రులు విసిగిపోగా, ఎవరో ఒకరి వద్ద ఉండాల్సి వచ్చిన పాప మనస్తత్వాన్ని చక్కగా ప్రదర్శించారు. 'రెండేళ్ళకి ముందు వికాస్‌ని డాడీ గా కాకపోయినా, ఓ ఫేమిలీ మెంబర్ గా అంగీకరించిన అమూల్య ఇప్పుడెందుకో అలా చేయలేకపోతోంది. చెప్పలేనంత అనీజీగానూ ఇన్ సెక్యూర్డ్ గానూ ఫీలవుతోంది' అంటాడు వినోద్ ఒక సందర్భంలో. మంచి పాయింట్ ఇది. స్నేహితుడిగా ఇంటికి వస్తూ పోతుండడం వేరు, తండ్రిగా ఇంట్లోనే ఉండడం వేరు. ఈ తేడా పిల్లలు గ్రహించినంతగా , వేరే ఎవరూ గ్రహించలేరు.

*కొడుకు పెళ్ళి*

డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం రచించిన ఈ కథ ఫిబ్రవరి 19 నాటి ఆంధ్రభూమి వార పత్రికలో ప్రచురితమయ్యింది. ఈ కథలో చమత్కారం కథ చివరన తెలుస్తుంది. పశుపతి జీవితం వడ్డించిన విస్తరి లాంటిది. మంచి ఆదాయం , భార్య, ముగ్గురు పిల్లలు ..చీకూ చింతా లేకుండా నడుస్తూంటుంది. అలాంటి పశుపతి హఠాత్తుగా మారిపోతాడు. కొడుకు పెళ్ళి చేయటంలో ఆసక్తి చూపడు. అనుకున్న సంబధాన్ని కాదంటాడు. కూతుళ్ళ పెళ్ళి చేస్తాడు. ఏ పని చేసినా అదో రకమైన అనాసక్తతతో చేస్తుంటాడు. అందరితో అంటీ ముట్టనట్టుంటాడు. అలాగని ఎవ్వరికీ ఏ లోటూ రానివ్వడు. చివరికి ఆస్థిని అందరికీ పంచేస్తాడు. భార్యకు కూడా వాటా ఇస్తాడు. ఇంతలో వాళ్ళబ్బాయి ఓ అమ్మాయిని ప్రేమించానని చెప్తాడు. ఎలాంటి భావోద్వేగాలు చూపడు పశుపతి. కొడుకు ఇష్టపడ్డ అమ్మాయితో పెళ్ళి నిశ్చయం చేస్తాడు. పెళ్ళికి ముందు రోజు అనారోగ్యం పాలయి ఆస్పత్రిలో చేరతాడు. అప్పుడు తన ప్రవర్తనకు కారణం వివరిస్తాడు. పశుపతి చెన్నైవెళ్ళినప్పుడు నాడీ జోస్యం చెప్పించుకుంటాడు. వాళ్ళు పశుపతి కొడుకు పెళ్ళి చూసే యోగం లేదని చెప్తారు.

అందుకని అందరితో అంటీ ముట్టనట్టుంటాడు. కొడుకు పెళ్ళి వాయిదా వేస్తుంటాడు. కొసమెరుపేమిటంటే, కొడుకు ఆరు నెలల క్రితమే రహస్యంగా పెళ్ళి చేసుకుంటాడు. అంటే 'కొడుకు పెళ్ళి చూసే యోగం లేదన్న' జ్యోతిష్కుడి మాటను పశుపతి ఒక రకంగా అర్థం చేసుకుంటే అది ఇంకో రకంగా జరుగుతుందన్నమాట. మనిషి ఎంత కాదనుకున్నా 'మాట' ప్రభావం అతనిపై ఉంటుంది. ఎదుటి వారి మాటను అర్థం చేసుకోడంలో తేడా జీవితాలనే మార్చివేస్తుంది. ముఖ్యంగా జ్యోతిషంలో చెప్పినదాన్ని జరిగే దాన్ని అన్వయించుకోవటంలోని తేడాలు జీవితగతినే మార్చివేస్తాయి. ఈ అంశాన్ని ఆసక్తికరంగా ప్రదర్శించింది ఈ కథ

*ఉజ్జిడి*

బల్లెడ నారాయణమూర్తి రచించిన ఈ కథ ఫిబ్రవరి 22 ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది. ఈ కథ గొప్పతనం కథను రచయిత చెప్పిన విధానంలో ఉంటుంది. ఓ గ్రామంలో ప్రజలందరి జీవితాలు, వాళ్ళ సంతానం ఐ.టి.రంగంలో ఉద్యోగాలు సంపాదించడంతో మారిపోతాయి. తమ సంతానానికి వచ్చే పెద్దజీతం ఇందుకు కారణం. అయితే హఠాత్తుగా ఐ.టి.రంగంలో పనిచేస్తున్న వారి ఉద్యోగాలు పోతుంటాయి. ఊరి వారికి ఇందుకు కారణం తెలియదు. కానీ తమవారికి ఉద్యోగాలు రావాలని దేవుడిని

ప్రార్థిస్తారంతా. ఇదీ కథ. కథ ఇలా చెప్తే మామూలుగా అనిపిస్తుంది. కానీ రచయిత 'యాస'తో కథ చెప్పడం కథకొక వింత సొగసునిస్తుంది. "ఊళ్ళో" రథయాత్రని 'ఉజ్జిడి' అంటారు. 'ఉజ్జిడి' తోలి కోరిన కోరిక నెరవేరుతుంది. రచయిత 'ఉజ్జిడి' ని వర్ణించిన తీరు, ఊళ్ళో వాళ్ళ జీవితాలలో దాని ప్రాముఖ్యాన్ని వివరించిన తీరు, ఈ కథను దేశంలో ఏప్రాంతానికయినా చెందినదానిగా మారుస్తుంది. చివరికి అందరూ తమవాళ్ళ ఉద్యోగాలు రావాలని కోరుకోవడంతో కథ ముగుస్తుంది. చక్కని కథ ఇది. అమాయక పల్లె బ్రతుకులను వారికి తెలియని అర్థంకాని ప్రపంచీకరణ ప్రభావితం చేయడం ఎదను హత్తుకునే రీతిలో చెప్తుందీ కథ.!

*ఎవరికీ తెలియని కథలివిలే!*

'అరుణ పప్పు' రచించిన ఈ కథ జనవరి 4. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది. 'పెళ్ళయీ అవకముందే జంటలు విడిపోవడానికి కీలకం వారి శృంగార జీవితం' అన్న సిద్ధాంతం ఆధారంగా సర్వే చేసి స్టోరీ రాయల్సి వస్తుంది ఓ మహిళా జర్నలిస్టుకి. సర్క్యులేషన్ పెంచుకునే ఆత్రంలో ఇటీవలె ఇంగ్లీషు పత్రికలు రెండుమూడు నెలలకోసారి సెక్స్ సర్వేలు జరిపి ఫలితాలు ప్రకటిస్తున్నాయి. మానవ సంవేదనలను అంకెలలో కుదించి ప్రజల అభిరుచులను దిశానిర్దేశనం చేస్తున్నాయి. అనైతిక ప్రవర్తనకు ప్రామాణికతను కల్పిస్తున్నాయి.. 'ఇంత శాతం ఇలా ప్రవర్తిస్తున్నారు. మీరూ ఇలా ప్రవర్తించండి..' అని సున్నితంగా సూచిస్తున్నాయి. ఈ కథలో అదితి అనే జర్నలిస్టుకు ఇలాంటి సర్వే చెయ్యాల్సి వస్తుంది. ఇబ్బందిగా ఫీలవుతుంది. అయినా ఉద్యోగ ధర్మం కొద్దీ కొందరిని ప్రశ్నిస్తుంది. సమాధానాలు రాబడుతుంది. చివరికి ఈ సర్వేలు శరీరానికే గానీ మనసుకి సంబధించినవి కావని గ్రహిస్తుంది. ఇదీ కథ. రచయిత్రి కథను నడిపిన తీరు బాగుంటుంది. మానవ సంబంధాలలో శృంగారం ఒక్కటే అసలు అంశం కాదని సున్నితంగా ప్రదర్శిస్తుంది ఈ కథ. మనం మన సమాజం అభివృద్ధి చెందింది , ఫ్రీ సొసైటీ అంటూ విశేషణాలు తగిలించుకుంటున్నా, ఇంకా కొన్ని ప్రధాన అంశాల విషయంలో సమాజంలో ఉన్న అపోహలను సున్నితంగా ఎత్తి చూపిస్తుందీ కథ. మూస కథలకు భిన్నమైన కథ.

*బంగారు వాకిలి*

వేదాంతం శ్రీపతి శర్మ రచించిన ఈ కథ జనవరి 7, 'నవ్య' లో ప్రచురితమైంది. ఈ కథను ఈ నెల కథగా ఎంచుకోవడానికి ప్రధాన కారణం , కథలోని మార్మికత. కథలో రచయిత సృజన అత్యుత్తమ స్థాయిలో ఉంటుంది. పాఠకుడు కథను కాజువల్‌గా చదివితే అర్థం చేసుకోలేడు. ఆలోచిస్తూ చదవాల్సిన కథ. చదువుతుంటే ఎనలేని ఆలోచనలను కలిగిస్తుందీ కథ. తిరుపతి వెంకటేశ్వరుడి ద్వారపాలకులు జయ, విజయులు. ఎప్పుడూ బయటి వైపే చూస్తుంటారు. వారికి స్వామి దర్శనం చేసుకోవాలనిపిస్తుంది. మనిషి రూపం ధరించి దర్శనం చేసుకుంటారు. భక్తుల సమూహంతో పాటు బయటకు నెట్టివేయబడతారు. వాళ్ళూ మళ్ళీ వెంకటేశ్వరుడి ద్వార పాలకులు విగ్రహాలుగా మారటం కథ. ఈ కథలో రచయిత ప్రదర్శించిన వ్యంగ్యం, మార్మికతలు అద్భుతంగా అనిపిస్తాయి. ఎంతో క్లిష్టమైన వేదాంత విషయాలను ప్రతీకాత్మకంగా, అత్యంత సున్నితంగా, సంఘటనల ద్వారా ప్రదర్శించిన రచయిత సృజనాత్మకత ఆశ్చర్యం కలిగిస్తుంది. మానవ రూపం ధరించిన జయ విజయులను పక్కకు తోయటం, 'లైన్లలో ఒకరి నొకరు కుమ్ముకుంటూ ఆతృతతో వెంకన్నను చూసుకుంటు, చిత్రమైన ముఖకవళికతను ప్రదర్శిస్తూ ఆ కొద్ది సేపట్లోనే ఏవేవో కోరికలు కోరుకుంటూ' సాగిపోయేవారనడం, ఇక్కడ సాష్టాంగపడకూడదని తోసేయడం, ఎక్కడున్నామా అని చూసే లోపల 'నిలబడకండి' అని రక్షకభటులు లాగేయడం..ఇలా మామూలుగా కనబడే సంఘటనలనే, కథ పరిధిలో విస్తృతమైన అర్థానిస్తూ ప్రదర్శిస్తాడు రచయిత. అలాగే ఒకప్పుడు ప్రత్యేక దర్శనాలు చేసుకున్న వ్యక్తి, భక్తుల పాదాల క్రింద చేతులుంచి తన్మయుడై ప్రతి భక్తుడిలో గోవిందుడిని చూడడం, అతడికోసం భగవంతుడు మారు వేషంలోరావడం, మళ్ళీ క్యూలో లోపలకు వెళ్తున్న స్వామి వారిని, ఎవరో వి.ఐ.పి. వస్తున్నాడని గంటలకొద్దీ నిలిపేయడం..'తనకోసం వచ్చే

ప్రతి భక్తుడిలో, తప్పిపోయిన పిల్లవాడు తల్లిదండ్రులని వెతికినట్టు వెతకాలని చెప్పటం..' ఒకటేమిటి ఈ కథలో ప్రతి ఘటన, ప్రతి పదం ఒక అపూర్వార్థంతో, తరచి చూస్తే గొప్ప వేదాంతార్థాలతో అలరారుతుంటాయి. ముఖ్యంగా కథ చివర భక్తుల ఒత్తిడికి భయపడుతున్న పిల్లవాడు, విగ్రహం చూసి 'ఎంత పెద్ద దేవుడు' అనటం అతిగొప్ప చమత్కారం! అత్యద్భుతమైన కథ. అత్యద్భుతమైన కథనం. ఇలాంటి కథలు ఏ సంకలనంలోనూ దొరకవు. ఏ అవార్డులూ పొందవు., ఏ విమర్శకుడి దృష్టికీ రావు.! అందుకే కథాసాగర మథనం శీర్షికన ఈ కథను పాఠకులకు అందిస్తున్నాం. చదవండి..మీరే నిర్ణయించండి. మి అభిప్రాయాల్ని నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా వ్యక్తపరచండి.

(K. Murali Krishna)
kmkp2025@gmail.com
9849617392

ఈనెల కథ

## బంగారు వాకిలి - వేదాంతం శ్రీపతి శర్మ

నవ్య వారపత్రిక జనవరి 7, 2009 సంచిక నుంచి

జయ విజయలకు విసుగ్గా ఉంది. తోసుకుంటూ, తొక్కిసలాటలో పడిపోతూ, కళ్ళల్లో ఏవేవో భావాలు చూపిస్తూ, దెబ్బలు తింటూ దేవుని దగ్గరకు వచ్చామన్న సంతోషంలో అదోలా నవ్వుకుంటూ గుమ్మడికాయల్లా దొర్లిపోతున్న జనావళిని నిరంతరం నిర్విరామంగా చూస్తూ నిలబడి ఉన్న వారిరువురికీ ఏదో బాధగా ఉంది.

స్వామికి కాపలాగా ఉన్నవారు వీరు. స్వామి వైపు తిరిగి ఆయన దర్శనం చేసుకోలేరు. స్వామిని చూసేవారిని చూస్తారు. వీళ్ళ కష్టాలు చూడటమే తప్ప స్వామిని ఎప్పుడు చూసేది? ఇద్దరికీ ఒకే ఆలోచన ఒకేసారి వచ్చినందుకు ఒకరి మొహాలొకళ్ళు చూసుకున్నారు. వాళ్ళకున్న మహిమ చేత మానవ రూపాలు దాల్చి శిలల నుంచి ఇవతలకి వచ్చి స్వామి వైపు తిరిగారు. అంతే! ఇద్దరు మనుషులు వచ్చి గట్టిగా పట్టుకుని తోసుకుంటూ ప్రక్కకి లాగారు.

'ఎక్కడి నుండి వచ్చార్రా మీరు? పదండి! ఏది మీ లైను?' అంటూ కేకలు వేశారు. లైనులో ఒకళ్ళనొకళ్ళు కుమ్ముకుంటూ ఆత్రుతతో వెంకన్నను చూసుకుంటూ చిత్రమైన ముఖ కవళికలను ప్రదర్శిస్తూ ఆ కొద్ది సేపట్లోనే ఏవేవో కోరికలను కోరుకుంటూ సాగిపోతున్న జనం ఒక్కసారి ఎందుకనో ఇద్దరి వైపు తిరిగి అరిచారు. ఏమవుతుందో తెలుసుకునే లోపల ఇద్దరూ బంగారు వాకిలికి ఇవతల వచ్చి పడ్డారు. దిక్కు తోచక మరల ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకున్నారు.

✡ ✡ ✡

ఏం జరిగిందో తెలిసే లోపల ఇద్దరు కర్రలతో నేలమీద గట్టిగా కొట్టారు. 'ఇక్కడ సాష్టాంగ పడకూడదు.....', అరిచారు, 'లెండి! ' ఇద్దరూ బాధగా లేచి నిలబడ్డారు. ఏంటో గోల గోలగా ఉంది. జనం అదే పనిగా ఎంతో హడావుడిగా వెళ్ళిపోతునారు. ఇద్దరికీ వింతగా ఉంది. కొద్ది సేపు ఎందుకో గుడిలోంచి ఇవతలకి వచ్చినందుకు సరికొత్త అనుభూతిలోకి వచ్చారు. అనంత కాలంగా

అనంతుడిని ధ్యానిస్తూ నిలబడ్డ ఇద్దరికీ పైన ఒక కొద్దిపాటి ఆకాశం కనిపించగానే చిత్రంగా చూస్తూ అడుగులో అడుగు వేస్తున్నారు. 'ఉచిత ప్రసాదం' అని వ్రాసి ఉన్న చోట అటూ ఇటూ చూస్తుండగా ఎవరో 'లైను' అని అరిచారు. చూసే లోపలే ఎవరో తోశారు. లైన్లోకి వెళ్ళి చెరో చిన్న లడ్డూ సంపాదించుకుని ఇవతలకి వచ్చారు. అవి తిని ప్రధాన ద్వారం దగ్గరకి ఒక్కసారి ఎక్కడున్నామా అనుకుంటూ వెనక్కి తిరిగారు. 'రావాలి, నిలబడకండి' అంటూ రక్షక భటులు అరిచారు. బాబోయ్ అనుకుంటూ కొద్దిగా జనం లేని చోటు మీదుగా ఒకరినొకరు కనిపెట్టుకుంటూ మెట్టు ఎక్కి ఆంజనేయస్వామి వారి గుడి దగ్గర నిలబడి స్వామిని దర్శించుకున్నారు. ఒక కుర్రాడు ఫోటోలు అమ్ముతున్నాడు.

'సార్, పటాలు, పదిరూపాయలు'

'ఏమిటవి?'

'ఫోటోలు, కాలెండర్లు'

'స్వామి ప్రతిరూపాలలా ఉన్నాయే!"

'కాదు సార్, ఫోటోలు'

ఇద్దరూ ఒకళ్ళ మొహాలొకళ్ళు చూసుకున్నారు.

'ఇవి మన దగ్గర పెట్టుకుంటే బావుంటుందేమో?'

'నిజమే. స్వామి వారిని రోజూ తలుచుకుని ధ్యానించుకోవచ్చును' ఫోటోలు తీసుకున్నారు.

'డబ్బులు ఇవ్వండి సార్, ఇరవై రూపాయలు'

'అంటే?'

'ట్వెంటీ రుపీస్. తెలుగు రాదా? తెలుగులోనే మాట్లాడుతున్నారు కదా?'

అర్థం కాక వాటిని తిరిగి ఇచ్చేశారు. అక్కడ జరుగుతున్నదేదీ బోధపడలేదు. 'స్వామి మనకు ఏరోజూ కనిపించే ఆస్కారం లేదు. మనం ఇటు తిరిగే నిలబడతాం'

'నిజమే ఆయన ప్రతిరూపం కుడా మనకి దక్కటం లేదు. ఈ అన్యాయం గురించి ఆయనకు చెప్పాలి'

'ఎలా? మనల్ని లోపలికి రానిచ్చేటట్లు లేరు.'

'చిత్రమైన సమస్య.. ఏం చేద్దాం?'

మైకులో ఎవరో తప్పిపోయిన వారి గురించి చెబుతున్నారు.

'మనం అక్కడ చెప్పాలేమో?'

'అవును'

✡ ✡ ✡

ఆ చుట్టు ప్రక్కల ఏ ఆఫీసులోనైనా ఎవరైనా మూడో వ్యక్తి గురించి మాట్లాడేందుకు వీలుగా ఇద్దరిద్దరు కూర్చుని ఉంటారు. ఒకడు దిష్టి బొమ్మలా చూస్తూ ఉంటాడు. ఈ ఆఫీసులోనూ అంతే. కాకపోతే ఒకడు దయ్యం పట్టిన వాడిలా ఉన్నాడు, ఇంకొక్కడు దయ్యాన్ని పట్టేవాడిలా ఉన్నాడు! జయవిజయలిద్దరూ కౌంటర్ దగ్గర నిలబడ్డారు.

'మేము తప్పిపోయాం' అన్నారు.

అతను ఇద్దరినీ చూసి నాలుక కరచుకోలేదు కానీ నాలుక మీద వేలితో తాకి ఒక కాగితాన్ని చేతికిచ్చాడు.

'దీని మీద వివరాలు వ్రాయండి'

'మాకు రాదు'

'ఓహో, ఇంత దండిగ ఉన్నారు? ఏలిముద్రా? సర్లె. నోటితో పేర్లు చెప్పండి'

'జయ'

'విజయ'

ఒకడికి పట్టిన దయ్యం వదిలి పోయింది.

'ఏందబ్బా, ఆడోళ్ళ పేరున్నట్లుండ్లే?'

(....)

'సరె! ఎవుర్ని పిలిపించాలి? తిన్నగ చెప్పండి!'

'స్వామిని!'

'ఏడుంటాడు?'

'వైకుంఠం!'

'ఓహో, క్యూకాంప్లెక్సులోకెళ్ళినాడా? సర్లె. పూర్తి పేరు చెప్పు. ఏ ఊరు?'

'వేంకటేశ్వర స్వామి. ఈ ఊరే!'

'తమాషా గుందిలే! ఉండు. చెపుతాను!'

అతను మైకు తీసుకుని ప్రకటన చేశాడు.

'భక్తులకు విజ్ఞప్తి. తిరుపతికి చెందిన వేంకటేశ్వర స్వామి తాలూకు ఇద్దరు వ్యక్తులు - జయ, విజయ అను పేర్లు గల వారు ఎంక్వయిరీ దగ్గర నిలబడి ఉన్నారు. ఈ స్వామి అనే ఆయన ప్రస్తుతం వైకుంఠం కాంప్లెక్స్‌లో ఉన్నట్లు తెలుపుతున్నారు. వారి దర్శనం అయిన తరువాత ఇక్కడికి వచ్చి కలుసుకొనగలరు'

ఇద్దరూ అక్కడే కూర్చున్నారు. కొన్ని గంటలు గడిచాయి. అతను మరో తప్పిపోయిన వ్యక్తి గురించి విచారిస్తున్నాడు.

వీళ్ళని జాలిగా చూశాడు.

'చూడండి, వైకుంఠం లోంచి రావాలంటే చాలా టైం పడుతుందిలే. మీరు పోయి ఏమైనా తిని రాకుడాదా? ఈడకే రండి, ఏమి?'

ఇద్దరూ లేచారు గుడిలో గంటలు మ్రోగుతున్నాయి. మరల షాపింగ్ కాంప్లెక్స్ లోంచి నడుచుకుంటూ ఆలయం వైపుకు వచ్చారు. గుడి లోపల తప్ప ఇవతల జనం 'గోవిందా' అనటం చూడలేదు. ఇంతలో ఎవరో 'గోవిందా' అనటం విని వెనక్కి చూశారు. అక్కడ మెట్ల దగ్గర ఒక వృద్ధుడు గోడకి ఆనుకుని 'గోవిందా, గోవిందా' అంటున్నాడు. గ్రుడ్డి వాడిలా ఉన్నాడు. ఆ శబ్దం ఎంతో ప్రేమతో ఆప్తులను పిలుస్తున్నట్లుంది. జనం పరుగులు తీస్తూనే ఉన్నారు. అతను నేల మీద పెట్టిన చేతిని ఒకళ్ళిద్దరు తొక్కుకుంటూ వెళ్ళిపోయారు. అతను వెంటనే 'గోవిందా' అన్నాడు.

'ఎందుకింత తొందర వీరికి?'

'కాదు. జాగ్రత్తగా చూడు. అతన్ని జనం తొక్కటం లేదు. అతనే కావాలని చెయ్యిని అక్కడ పెట్టి వాళ్ళు తొక్కేలా చేస్తున్నాడు'

వింతగా తోచి అక్కడికి దగ్గరగా నడిచారు నిజమే. ఎందుకో గుడిలోంచి ఇవతలకి వచ్చిన వాళ్ళ పాదాల క్రింద తన చేయిని పెడుతున్నాడు. నిజానికి అతను అడుక్కోవటమూ లేదు. ఏవో కొన్ని నాణాలు ప్రక్కన పడేసి ఉన్నాయి. 'గోవిందా, గోవిందా' అంటూనే ఉన్నాడు.

ఇంతలో ఇద్దరికీ మహదానందం కలిగింది. మైకులో చేసిన ప్రకటన వలన కాబోలు, స్వామి వారు మారువేషంలో అక్కడికి వస్తున్నట్లు గ్రహించారు. ఆయన భక్తుని వేషంలో తిరునామాలు ధరించి నేరుగా ఆ గుడ్డి వ్యక్తి దగ్గరకు వచ్చి అతని చేయి మీద మెల్లగా కాళ్ళు మోపారు. అతను ఆనందంతో పులకించి పోయాడు. ఓపికంతా కూడదీసుకుని 'గోవిందా' అన్నాడు. గుడిలోంచి గంటలు మరింత గట్టిగా వినిపిస్తున్నాయి.

'గోవిందా నామము….' ఏదో క్యాసెట్ లోంచి అన్నమయ్య పాడుతున్నట్లుంది. స్వామి అతని ప్రక్కన కూర్చున్నారు.

'ఇలా ఎందుకు ఇందరి చేత తొక్కించుకుంటావు?'

అతను తల అటూ ఇటూ ఊపాడు. మాటలు రావడం లేదు.

ఆయన పాదాల మీద తల వాల్చి కన్నీరు కారుస్తున్నాడు. ఈ లోకంలో లేడు. మెల్లగా తల ఎత్తాడు.

'చెప్పవా?'

అతను ఓపిక చేసుకున్నాడు.

'స్వామీ, మీరు గుడిలోంచే వస్తున్నారా?'

'అవును'

'నా స్వామి బావున్నాడా?'

'బావున్నాడు'

'నిండుగా, మెండుగా, నవ్వుతూ, చెయ్యి క్రిందకి చూపిస్తూ అలా నిలబడే ఉన్నాడా?'

'అవును. అలానే ఉన్నాడు'

'చూశారా? నేను చూడలేను. కానీ గుడిలోంచి వచ్చి నా చెయ్యి మీదుగా అలా ఎవరైనా నడవగానే స్వామిని నా కళ్ళల్లో కాదు, నా శరీరం మనస్సూ, సర్వం కనులు చేసుకుని చూస్తాను!'

జయ విజయులకు ఆశ్చర్యం వేసింది. అతనికి ఇరుప్రక్కలా కూర్చున్నారు.

'ఇక్కడ ఎన్ని రోజులుగా ఉంటున్నావు?' అడిగారు.

'గత రెండు సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్నాను. నేను ఒక జీవితకాలం కొండకు వస్తూనే గడిపేశాను. రకరకాల హోదాలలో దర్శనం చేసుకున్నాను. వి.ఐ.పి కోటాలో పలుమార్లు, మరేదో కోటాలో ఇంకొన్ని మార్లు మొత్తానికి అన్ని రకాలూ చూశాను. ఒకసారి లైన్లో వేలాది మంది పిల్లా పాపలతో వేచి ఉండగా వాళ్ళ కేకలు, ఏడుపులు వింటూనే ఒక ప్రముఖుని వెనక వెళ్ళి ఒక గంట సేపు దర్శనం చేసుకుని వచ్చాను. దారిలో ఎక్కడో అనుకున్నాను - వీరందరూ మమ్మల్ని తిట్టుకోరా? అని. రిటైరయిన తరువాత ఈ గుడికి వచ్చేవారి సేవలో ఆస్తిని వెచ్చించి కాలం గడిపేశాను. నాకెవరూ లేరు. అందరూ ఎవరి దారిన వారు వెళ్ళి పోయారు!' అతను మాట్లాడుతూనే అక్కడ మరల చేతులు నేల మీద పెడుతున్నాడు. ఎవరో పొరపాటుగా తొక్కి వెనక్కి తిరిగి బాధ పడుతున్నారు. ఇతను 'గోవిందా' అనుకుని పులకరించి పోతున్నాడు. రెండు చేతులూ కళ్ళకద్దుకుంటున్నాడు. తెగ మురిసిపోతున్నాడు. కళ్ళని కప్పిన చేతులను శరీరమంతా అద్దుకుంటున్నాడు. 'ఈ చేతులే ప్రతి ఉదయం నాకోసం బంగారు వాకిలిని తెరుస్తాయి. మూసి ఉంచుకుని స్వామిని ధ్యానిస్తున్న ఈ రెండు కనులూ ఆ జయవిజయులు… అదుగో ఆ స్వామి… ఎందుకో అలా నవ్వుతూనే ఉంటాడు!'

✡ ✡ ✡

స్వామి వెంట ఇద్దరూ మౌనంగా నడిచారు.

'స్వామి...'

'చెప్పండి'

'మనం లోపలికి వెళ్ళటం ఎలా?'

'బావుంది. మీరెలాగూ గుడిలోంచి ఇవతలకి వచ్చారు కదా, నన్ను ఎలాగో అలాగ మరల లోపలికి తీసుకెళతారని ఆశించి నా భక్తుని కోసం నేను వచ్చాను'

'అయ్యో, మీరలా అనేస్తే ఎలా?'

'మీరు మహా వీరులు కదా?'

'మా వల్ల కాదు. స్వామి మిమ్మల్ని ఆపద మ్రొక్కులవాడు అంటారు. ఇందర్ని ఇన్ని అవస్థలు పెట్టి దర్శనాలు ఏమిటి స్వామీ? ఈ కోటాలెందుకు?'

'లక్షల మంది నా దగ్గరకి వచ్చి ఏవేవో కోరుకుంటారు. తన ముందు, వెనుక ఉన్న వారి బాధ గురించి ఒక్కరూ అడగరు. అందుకు ఈ తోపుళ్ళు!'

'ఎలా అడగాలి స్వామీ? అంత సమయం ఏది?'

'రండి. పుష్కరిణిలో స్నానం. ఇది మొదటి పని. రెండు ఆది వరాహ స్వామిని దర్శించుకుని కోరిక - ఈ కోరికే కోరండి. మూడు నాదగ్గరకొచ్చి నా పాదాలవైపు నమస్కరించి నేను క్రిందకి చూపిస్తున్న వరదాభయహస్తాన్ని దర్శించి వరాహస్వామి సాక్షిగా కోరుతున్నట్లు మరల కోరండి. అదీ పద్ధతి. ఆయన తీర్చవలసిన కోరికలను నేను తీరుస్తాను!'

నియమాలు పాటించి 'వైకుంఠం' దగ్గరకి వచ్చారు. భక్తుల మధ్య గోవిందగానం చేసుకుంటూ 'సర్వదర్శనం'లోకి వెళ్ళారు. జయ విజయులు స్వామి వెంట ఆనంద నిలయం వైపుకి నడిచారు. ఆ కుదుపులకీ, దెబ్బలకీ, సన్నని లైనులోని ఇబ్బందులకీ మరింత గట్టిగా గోవింద నామం చేశారు. స్వామి వారు ఆయన బిడ్డలెందరో పలుకుతున్న గోవింద నామానికి తన్మయత్వం చెందుతూ కదిలారు....

ప్రధాన ద్వారం దగ్గర ప్రముఖులెవరో నేరుగా లోనికి వెళుతున్నారు. అందరినీ ఆపేశారు. స్వామి ముందర ఒక ఇనుప చువ్వ అడ్డంగా పెట్టారు.జయ విజయులను మాట్లాడవద్దని సైగ చేశారు.

'ప్రక్క వారి బాధ తెలియని వారు మనుషులు కారు...'. వెనుక ఎవరో అంటున్నారు... 'వీళ్ళకి దేవుడెందుకు?'

స్వామి వారి ప్రక్కన నిలబడి ఉన్న వాహనాలన్నీ ఆయన్ని చూసి తరించాయి. ఆయన అందుకే ఆగారా అనుకున్నాయి. కొద్ది సేపట్లో లైను జరిగింది. బంగారు వాకిలి దగ్గరయింది. వకుళమాతను లైనులోంచే చూసుకున్నారు స్వామి.

జయ విజయులని ఆశీర్వదించారు. 'నా వైపు తిరిగి నన్ను చూడలేక పోతున్నారని బాధ పడకండి...' చెప్పారు. '..మీరు ఎంతో ధన్యులు. నా కోసం తరలి వచ్చే వారందరిలో నన్ను చూసి తరిస్తారు. నన్ను తప్పి పోయిన పిల్లవాడు తల్లితండ్రులను వెతికినట్లు వెతకాలి. నన్ను సంపూర్ణంగా దర్శించుకునేందుకు పూర్తిగా తెరుచుకునే బంగారు వాకిలి అదే..' అంటూ ఆయన లోపలికి వెళ్ళిపోయారు. జయవిజయులు వారి పూర్వపు స్వరూపాలలోకి ప్రవేశించారు.

జనం ఆగుతున్నారు, సాగుతున్నారు. రక్షక భటులు తోస్తున్నారు. లాగుతున్నారు. పిల్లలు కేకలు పెడుతున్నారు. అయినా అందరి కళ్ళల్లో ఏదో మెరుపు.

‘నాన్నా...‘, ఎవరో పిల్లవాడు అడుగుతున్నాడు.

‘కనిపించటం లేదా?‘

‘నన్ను నలిపేస్తున్నారు. ఇంతమంది ఎందుకు తోస్తారు?‘ అతన్ని తండ్రి పైకి ఎత్తుకున్నాడు.

‘చూడు నాన్నా, అందరికీ నాన్న మరి. ఎంత మందిని ఎత్తుకుంటాడు? అవునా?‘

‘కనిపించాడు నాన్నా. ఎంత పెద్ద దేవుడో! ‘

